క్లుప్తంగా

ఎంపీటీసీ పదవి నుంచి తొలగింపు

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామ ఎంపీటీసీ రేణుకుంట్ల చిన్నరాయుడుని ఎంపీటీసీ పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ పమేలాసత్పతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీఓ పుల్లయ్య తెలిపారు. జనవరి 7వ తేది రాత్రి భోగంపాడు, సిరిసేడు గ్రామ పరిధిలోని ఎర్రగుట్ట వద్ద ఉన్న పల్లె ప్రకృతి వనాన్ని ఎంపీటీసీ చిన్నరాయుడు ఇతరుల సహాయంతో జేసీబీతో ధ్వంసం చేయించినందుకు, పంచాయతీరాజ్ చట్టం 2018 కింద తనకు కేటాయించిన విధులను నిర్వర్తించడంలో విఫలమాయ్యడనే కారణంతో పదవి నుంచి తొలగించినట్లు తెలిపారు. ఉత్తర్వు తేదీ నుంచి ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులవుతారని పేర్కొన్నారు.

ఇసుక డంపులు స్వాధీనం

ఇల్లందకుంట: మండలంలోని వంతడ్పుల గ్రామ శివారులో నిల్వ చేసిన ఇసుక డంపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోతుగల్ గ్రామానికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని డ్రైవర్, యజమానులు, ఇసుక నిల్వ చేసేవారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. అక్రమంగా తరలించిన దాదాపు 20 ట్రిప్పుల ఇసుకను స్థానిక తహసీల్దార్‌కు అప్పగించడం జరిగిందన్నారు. అక్రమంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద టౌన్ సీఐ వరగంటి రవి ఆదేశాల మేరకు సోమవారం రాత్రి పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రవి, పోలీసులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

గంగాధర: మండలంలోని మధురానగర్ గ్రామం సాయివిన్నర్స్ హైస్కూల్ పాఠశాల విద్యార్థులు ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ టు ఆల్‌స్టైల్ కుంగుఫూ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించినట్లు కరస్పాండెంట్ మల్లయ్య తెలిపారు. పాఠశాలకు చెందిన సీహెచ్ అభినందన్ బంగారు పతకం, కృతీశ్రీ, సిరిచందన, హర్షవర్ధన్‌రెడ్డి, మణిదీప్ సిల్వర్ మెడల్స్, కృతికారెడ్డి, వైష్ణవి, అద్నాన్ బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్, మాస్టర్ శేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎనీమియా ముక్త్ భారత్‌లో భాగంగా సోమవారం హుజూరాబాద్‌కు చెందిన వైద్యబృందం 8, 9,10వ తరగతి విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యాధికారులు అనురాగ రేఖ, బి. శ్వేతారెడ్డి మాట్లాడుతూ...హిమోగ్లోబిన్ శాతం పెంచుకోవడానికి ప్రతిరోజు పాఠశాలలో ప్రభుత్వం అందించే రాగిజావ తాగాలని విద్యార్థులకు సూచించారు. ఆకుకూరలతో పాటు బొప్పాయి, పా లు, ఖర్జూర, తేనె, బెల్లం, చేపలు, గుడ్లు, ఐరన్ ఎక్కువగా ఉండే వాటిని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ ఆర్.శారద, ఏఎన్ఎంలు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవనాలు నేలమట్టం



శంకరపట్నం: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మొలంగూర్ క్రాస్‌రోడ్‌లోని భవనాలు నేలమట్టం అవుతున్నాయి. మొలంగూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ క్రాస్‌రోడ్‌లో భవనం నిర్మించుకున్నాడు. ప్రస్తుతం ధరల ప్రకారం బిల్డింగ్‌కు రూ. కోట్లలో ధర పలుకుతుంది. కానీ ప్రభుత్వం సుమారు రూ. కోటి వరకు పరిహారం చెల్లించింది. జాతీయ రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్న క్రమంలో రెండు రోజులుగా ప్రొక్లెయిన్‌తో కూల్చివేస్తున్నారు.

నియామకం

జమ్మికుంట: జమ్మికుంట మండల సాంస్కృతిక సమాఖ్య మండల కమిటీ ఉపాధ్యక్షుడిగా రంగు లింగయ్య, మొలుగూరి సుమలత, ప్రధాన కార్యదర్శిగా కొలుగురి రజిత ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు వైఎస్ శర్మ ఆదేశాల మేరకు జమ్మికుంట మండల సాంస్కృతిక సమాఖ్య సంస్థ అధ్యక్షుడు వేముల అశోక్, హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు తాండ్ర శంకర్ సోమవారం వీరిని నియమించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కళలను వెలికితీస్తూ, కళాకారులను తయారు చేయడానికి సంస్థ తోడ్పటు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొమురయ్య, నారాయణ, ప్రభాకర్ రావు, గడ్డం నారాయణ తదితరులు ఉన్నారు.

పంటలు కాపాడుకోవడానికి..

- వంతుల వారీగా విద్యుత్ వినియోగం
- సరిపోని ట్రాన్స్‌ఫార్మర్ ఎస్ఎస్ –8 కెపాసిటీ
- సమస్య పరిష్కరించాలంటూ రైతుల వినతులు
- స్పందించని అధికారులు



ఎస్ఎస్-8 ట్రాన్స్‌ఫార్మర్

గంగాధర: ట్రాన్స్‌ఫార్మర్ లోవోల్టేజి సమస్యతో మోటార్లు మొరాయించి తరుచూ కాలిపోతున్నాయని, కరెంట్ మోటారు నడిస్తే కాలువ పారక ముందే బందవుతుంది, పోసిన నారుమడులను పారించడానికి రాత్రి పూట కరెంట్ పెట్టడానికి వెళ్లవలిసి వస్తుందని ఆ రైతులు ఆవేదన చెందుతున్నారు. సమస్య పరిష్కరించడానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విద్యుత్ సిబ్బందిని వేడుకున్నా అధికారులు స్పందించటంలేదు. సమస్యపై ఏఈ నుంచి సీఎండీ స్థాయి అధికారి వరకు వినతిపత్రాలు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదు. సాగు చేసిన పంటలను కాపాడుకోవాలని ఓ నిర్ణయానికి వచ్చారు. రైతులే తమ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించుకోవడానికి సమావేశమయ్యారు. వంతుల వారీగా విద్యుత్‌ను వినియోగించుకుంటూ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

మండలంలోని కురిక్యాల రెవెన్యూ గ్రామ పరిధిలోని కొండన్నపల్లి గ్రామం శివారులోని వరద కాలువ సమీపంలోని కేఎల్ ఎస్ఎస్-8 ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని రైతుల కరెంట్ కష్టాలు వర్ణనాతీతం. కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినప్పుడు 5 హెచ్‌పీ కనెక్షన్లు 13 ఉండగా ప్రస్తుతం 23 కనెక్షన్లకు పెంచారు. దీంతో విద్యుత్ సరిపోక మోటార్లు మొరాయించడంతో పాటు తరుచూ కాలిపోయేవి. పుష్కలంగా నీరున్నా పంటపొలాలు సాగు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. యాసంగిలో సాగు చేసిన వరిపంటను కాపాడుకోవడానికి 23 వ్యవసాయ పంపులకు చెందిన రైతులు వంతుల వారీగా కరెంట్ మోటార్లు నడిపించుకుంటున్నారు. ఒక రోజు 11మంది రైతులు, మరునాడు 12 మంది రైతులు విద్యుత్‌ను వినియోగించుకుంటున్నామని రైతులు తెలిపారు. ఇలా వినియోగించుకుంటున్నా రోజుకు రెండు మూడు గంటలు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కురిక్యాల ఫీడర్ పరిధిలోదాదాపు 150కి ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఏ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో విద్యుత్ అంతరాయం కలిగినా గ్రామాల్లో పనిచేసే విద్యుత్ సిబ్బంది సబ్ స్టేషన్ నుంచి ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) తీసుకొని మరమ్మతు చేస్తుంటారు. ట్రాన్స్‌ఫర్మర్‌ల ఏబీ స్విచ్‌లు మరమ్మతుకు రావడంతో ఎల్‌సీ తీసుకుంటున్నారు. ఎల్‌సీ తీసుకున్న ప్రతిసారి ఫీడర్ పరిధిలో మొత్తం విద్యుత్ సరఫరా నిలిచి పోతోంది. కాగా ఏఈ ఆపై అధికారులు అనుమతితోనే ఎల్‌సీ ఇవ్వాలని ఉన్నతాధికారులు మూడు రోజుల క్రితం ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కరిస్తేనే భవిష్యత్‌లో పంటలు సాగుకు నోచుకుంటాయని రైతులు పేర్కొంటున్నారు.

నాలుగేళ్లుగా తంటాలు



విద్యుత్ సరఫరా సమస్యతో మోటార్లు మొరాయించి తరుచూ కాలిపోతున్నాయి. నాలుగేళ్లుగా విద్యుత్ సమస్యతో సతమతమవుతున్నాం. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను వేడుకుంటున్నాం.

– రేండ్ల వీరయ్య రైతు, కొండన్నపల్లి

ఫ్యూజులు కొట్టేస్తున్నాయి



వచ్చిరాని కరెంట్‌తో పాటు లోవోల్టేజితో యాసంగి పంటలు పండించడానికి తంటాలు పడుతున్నాం. వంతుల వారీగా విద్యుత్ వినియోగించుకుంటూ కరెంట్ మోటార్లు నడిపిస్తున్నాం. అయినా విద్యుత్ సమస్యతో ఫ్యూజులు కొట్టేస్తున్నాయి.

– తొరికొండ శ్రీనివాస్,రైతు, కొండన్నపల్లి

దరఖాస్తుల గడువు పెంపు



వీణవంక: మోడల్ స్కూల్లో ప్రవేశాలకు మార్చి 2వరకు గడువు పొడిగించినట్లు మండలంలోని ఘన్ముక్కుల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి పదోతరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మీ సేవ లేదా ఇంటర్‌నెట్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌ను ఆశ్రయించాలని తెలిపారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

మానకొండూర్: మానకొండూర్ గ్రామ పరిధిలోని బొరగుట్ట 336 సర్వే భూమిని కాపాడాలని సీపీఎం మానకొండూర్ జోన్ కార్యదర్శి సుంకరి సంపత్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొంతమంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు సొంతభూమికి అనుకూలంగా ప్రభుత్వ భూమి నుంచి రోడ్డు వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

వీణవంక: మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అజుమియా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తనతో చదువుకున్న పదో తరగతి మిత్రులు అజుమియా కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎండీ సాహెబ్‌హుస్సేన్, కర్ర కుమార్‌రెడ్డి, తాటిపాముల శ్రీనివాస్, గట్టు వీరస్వామి, పైడిమల్ల శ్రీనివాస్, కూచనపల్లి కుమారస్వామి, పోతుల సురేశ్, ఎండీ షరీఫ్, మహబూబ్ ఉన్నారు.

చొప్పదండిని అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు: అభివృద్ధిలో చొప్పదండి నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతానని ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో సోమవారం రూ.కోటి ఇరవైలక్షల ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుండి గ్రామంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గార్ల సహాయ సహకారంతో నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది ప్రజలకు ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని రెండు అమలు చేశాం మరో రెండు రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్ పథకం ప్రియాంక గాంధీ చేవెళ్లలో ప్రారంభించనుందని పేర్కొన్నారు. పదేళ్ల కేసీఆర్ నిరంకుశ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా నష్టం కలిగిందన్నారు. ప్రతి నియోజక వర్గంలో 3,500 ఇళ్లు కట్టిస్తామని, నియోజకవర్గానికి రూ. పది కోట్ల ప్రత్యేకంగా నిధులు కేటాయింపు చేయడం జరిగిందని, వీటితో పలు పనులు త్వరలో చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరీ, ఏఈ సచిన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మండల అధ్యక్షుడు తిరుపతి, మాజీ ఎంపీపీ అంజలి, ఎంపీటీసీలు, తిరుమల, హరీశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉప్పుల అంజనీప్రసాద్, నాయకులు నర్సింగ్‌బాబు, విష్ణు, శ్రీనివాస్, సుధీర్, హన్మంతు, సాయి, వెంకటేశ్, బాపురాజు, తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందించాలి

హుజూరాబాద్‌రూరల్: నియోజకవర్గంలో చివరి ఆయకట్టుకు నీరందించేలా చర్యలు చేపట్టాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్‌పై ఉన్న కోపంతో పంట పొలాలకు నీళ్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టవద్దని కోరారు. పొలాలు ఎండితే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. నియోజకవర్గంలో చివరి ఆయకట్టు నీరందకుంటే కాంగ్రెస్ నాయకులను అడ్డుకోవాలన్నారు.

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌ను కలిసిన సమ్మిరెడ్డి

జమ్మికుంట: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా ఐజేయూ జాతీయ అధ్యక్షుడు, సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్‌రెడ్డి నియామకమయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డిని జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కొత్త వినీత

తిమ్మాపూర్: ఎండల తీవ్రత పెరుగుతుండడం, భూగర్భ జలాలు అడుగు అంటుతుండడంతో రాబోయే వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు నివారణ చర్యలు చేపట్టాలని చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా వేసవిలో నీటి ఎద్దడి లేకుండా నివారణ చర్యలు చేపట్టామన్నారు. గ్రామాల్లో వాటర్ లీకేజీలు లేకుండా చూడాలని, నీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికి నీరు అందించేలా అధికారులు గ్రామాల వారీగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. నీటి ఎద్దడి ఎదురైతే ప్రజలకు నీటిని ఎక్కడి నుంచి సరఫరా చేయాలి, ఉన్న వనరులను ఎలా సద్వినియోగం చేసుకోవాలి అనే కోణంలో చర్చించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, ఎంపీడీవో బాసం మధుసూదన్, తహసీల్దార్ ఇప్ప నరేందర్, వ్యవసాయ అధికారి రంజిత్ కుమార్, మండల పశువైద్యాధికారులు శ్రీధర్, శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీలు, గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ



రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఏడిఏ జి.సునీత

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను హుజూరాబాద్ డివిజన్ వ్యవసాయ అధికారి జి.సునీత ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి గుర్రం రజిత, సిబ్బంది సోమవారం తనిఖీ చేశారు. నిల్వ ఉన్న విత్తనాలను పరిశీలించడంతో పాటు స్టాక్‌రిజిష్టర్లను పరిశీలించారు. రైతులు విత్తనాలు కొన్న వెంటనే బిల్లులు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని ఏడీఏ తెలిపారు. రైతులకు ఏమైనా ఇబ్బందులుంటే సంప్రదించాలని కోరారు.

'దళిత బంధు' లబ్ధిదారుల అరెస్ట్‌ను ఖండిస్తున్నాం

జమ్మికుంట: హుజూరాబాద్ నియోజకవర్గంలోని దళితబంధు లబ్దిదారులు ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో శాంతియుతంగా ఫిర్యాదు చేయడానికి వెళ్తే అరెస్ట్ చేసి పోలీస్ ట్రెనింగ్ సెంటర్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని దళితరత్న అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ అన్నారు. సోమవారం పట్టణంలో మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గాన్ని గత ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు వేసిందని, ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు మంజూరు చేసి మొదటి విడుతగా రూ.5లక్షలు అందించిందని, రెండో విడుత నిధులు సాధారణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిలిచిపోయాయని, సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు ఇవ్వడం లేదని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నిర్వహించిన 25వేల ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల నియమక పత్రాలు అందించి మా ప్రభుత్వమే ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని, అక్రమంగా అరెస్ట్ చేసిన దళిత బంధు లబ్దిదారులను వెంటనే విడుదల చేయాలని, రెండో విడుత కింద రూ.5లక్షలు మంజురు చేసేలా కలెక్టర్‌కు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఎంపిక చేసిన దళితబంధు లబ్దిదారులకు డబ్బులు మంజురు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో దళిత సమాజం ఐక్యంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 8 మందికి జైలు

కరీంనగర్ క్రైం: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 8 మందికి కరీంనగర్ కోర్టు జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ సర్వర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నగరంలో మద్యం సేవించి, వాహనాలు నడుపుతూ పట్టుబడిన 16 మందిని పోలీసులు సోమవారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వీరిలో ఇద్దరికి 10 రోజులు, ఒకరికి 7 రోజులు, మరొకరికి 5 రోజులు, ఇంకో నలుగురికి 3 రోజుల జైలుశిక్ష, రూ.16 వేల జరిమానా, మిగతా 8 మందికి రూ.15 వేల జరిమానా విధించినట్లు ఏసీపీ తెలిపారు.

నేడు 2కే వాకథాన్

కరీంనగర్ అర్బన్: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం 2కే వాకథాన్ నిర్వహిస్తున్నట్లు ఎల్డీయం ఆంజనేయులు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ పమేలా సత్పతి జెండా ఊపి ప్రారంభిస్తారని అన్నారు. జిల్లా అధికారులు, బీఎంలు, బ్యాంకు కంట్రోలర్ లందరూ సకాలంలో పాల్గొనాలని కోరారు.


దళితబంధు నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న వాసు, వెంకన్న, కుమార్

హుజూరాబాద్‌రూరల్: రెండో విడుత దళితబంధు నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ గార్డెన్ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రెండో విడత నిధుల మంజూరుకు ఎన్నికల కోడ్ రావడంతో ఖాతాలు ఫ్రీజ్ చేశారని తెలిపారు. దళిత బంధు పథకం ద్వారా లబ్దిపొందినవారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు రెండో విడుత నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. సమావేశంలో బీసీ సీనియర్ నాయకులు సందేల వెంకన్న, బాషవేన కుమార్, ఎస్ఎస్‌బీఎం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి సమ్మయ్య, కొలిపాక సుమన్, వీరబోయిన కొమురయ్య, కొహెడ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 'షబేబరాత్' వేడుకలు



జమ్మికుంట: మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గాలో ముస్లింల పవిత్ర మాసం షాబాన్ సందర్భంగా హజ్రత్ సయ్యద్ ఇంకుషావలీ రహమతుల్లాహ్ అలై దర్గాలో ఆదివారం రాత్రి షబేబరాత్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మృతి చెందిన పూర్వికుల ఆత్మకుశాంతి చేకుర్చాలని సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సందేశాలు, ఖురాన్ సూక్తులను వివరించారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అంకుషావలి, సయ్యద్ సమీర్, దర్గా కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ కరీం, కార్యనిర్వాహక అధ్యక్షుడు తౌపిక్ హుస్సేన్, కార్యదర్శి అశ్రఫ్, కోశాధికారి, సయుక్త కార్యదర్శి నయిమొద్దీన్, సభ్యులు లతీఫ్, హుస్సేన్, తాజ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్‌లో సోమవారం ఎమ్మెల్యే కోటా నుంచి మంజూరైన రూ.10 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ నాయకులు కనకం అశోక్ తెలిపారు.

ఆలయంలో పూజలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని రాజస్థాన్ మార్వాడి మందిర్‌ను బీజేపీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ సోమవారం దర్శించుకున్నారు. రామ్‌దేవ్ బాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ అనంతరం శిఖర దర్శనం చేసుకున్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా శ్రీవిశ్వేశ్వరస్వామి చిన్నరథోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

జమ్మికుంట: పట్టణంలోని పురాతన శ్రీవిశ్వేశ్వర స్వామి(బొమ్మల గుడి)దేవాలయం వార్షికోత్సవంలో భాగంగా సోమవారం శ్రీవిశ్వేశ్వరస్వామివారిని చిన్న రథంపై పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు మంగళహారతులతో స్వామి వారికి స్వాగతం పలుకుగూ మొక్కులు చెల్లించుకున్నారు. మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ, అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి విగ్రహప్రతిష్ఠాపన

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో సోమవారం వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు గంగాధరశాస్త్రి ఆధ్వర్యంలో ధ్వజస్తంభన, విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మార్కండేయ దేవాలయ మహోత్సవాలు



ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలను ప్రారంభిస్తున్న శ్రీనమిలికొండ రమణాచార్యస్వామి



గన్నేరువరం: మండలంలోని జంగపల్లిలో గ్రామంలో పద్మశాలి కుల బాంధవులు నిర్మించిన భక్త మార్కండేయ దేవాలయ మహోత్సవాలు మయూరగిరి పీఠాధిపతులు శ్రీమాన్ శ్రీ నమిలికొండ రమణాచార్య స్వామివారి ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 29వ తేదీ వరకు మహోత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు ఉత్సవమూర్తుల ఊరేగింపు భక్తుల భగవాన్ నామస్మరణ, కోలాటాలు, డప్పు చప్పుళ్ల మధ్య ఘనంగా నిర్వహించారు. చివరి రోజు ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ, శివకల్యాణ మహోత్సవం ఉంటుందని భక్తులు అధిక పాల్గొని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జాతర ఆదాయం రూ.9,26,890

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం సమ్మక్క–సారలమ్మ జాతర ఆదాయం రూ.9, 26, 890 వచ్చినట్లు జాతర కమిటీ చైర్మన్ గుర్రం స్వామి తెలిపారు. జాతర హుండీలను కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఎంపీడీవో శ్రీవాణి సమక్షంలో లెక్కించారు. ఈకార్యక్రమంలోఈవో మారుతిరావు, ఏఎస్సై సుధాకర్, ధర్మకర్త పాల్గొన్నారు.

వర్చువల్‌గా రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ప్రారంభం



వర్చువల్ ప్రారంభంలో కృష్ణారెడ్డి, నాయకులు

జమ్మికుంట: దేశ రైల్వే ముఖచిత్రాన్ని కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం మార్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని తనుగుల, విలాసాగర్ రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని సోమవారం ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. రైల్వేను ఆధునికరిస్తూ, ప్రయాణికుల కోసం బుల్లెట్, వందేభారత్ రైళ్లు తీసుకువచ్చిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 554 రైల్వే స్టేషన్లు పునరాభివృద్ధి, 1500 రోడ్లు, ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌ల నిర్మాణం కోసం సూమారు రూ. 41వేల కోట్ల నిధులు కేటాయించారని అన్నారు. తనుగుల, విలాసాగర్ అండర్ పాస్ నిర్మాణం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో దక్షణమధ్య రైల్వే అధికారి మనోజ్‌కుమార్ గుప్తా, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, జమ్మికుంట పట్టణ, మండల అధ్యక్షులు జీడి మల్లేశ్, సంపత్‌రావు, ఎంపీటీసీ తోట కవితలక్ష్మణ్, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రావుల సంపత్, సింగిల్ విండోవైస్ చైర్మన్ మహ్మద్ షఫీ, నాయకులు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, రాముల కుమార్, పూల్లురి ఈశ్వర్, రాచపల్లి వెంకటేష్, సమిండ్ల విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నెరవేరుస్తుంది

తిమ్మాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తుందని మంగళవారం మరో రెండు పథకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందని చిగురుమామిడి జెడ్పీటీసీ రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి జిల్లా అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మాట్లాడారు. ప్ర భుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ముందుకెళ్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తుందని, అందులో భాగంగా మొదట మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్య భీమా రూ. 10 లక్షలకు పెంపుతో పాటు మరో రెండు పథకాలు 200 యూనిట్లు కరెంటు, రూ. 500 గ్యాస్ అందిస్తామన్నారు. పథకాలను ప్రవేశపెట్టడం పట్ల ప్రజల పక్షాన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డీసీసీ కార్యదర్శి మల్ల రవీందర్, నాయకులు రాములు, నరేష్, లచ్చిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.